ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తమిళనాడు
TAMILNADU
గురువారం 6 ఫిబ్రవరి 2025


ఈరోడ్‌లోని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు దీరిన మహిళా ఓటర్లు


ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు


ఓటు హక్కు వినియోగించుకున్న డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్


యువ ఓటర్ల ఉత్సాహం


ఓ పోలింగ్ కేంద్రంలో
ఓటు హక్కు వినియోగించుకుంటున్నఅధికారి

ప్రశాంతంగా ముగిసిన
ఈరోడ్ ఈస్ట్ ఉపఎన్నిక

● 77.58 శాతం పోలింగ్ నమోదు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో 77.58 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఈరోడ్ ఈస్ట్ శాసనసభ్యుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ డిసెంబర్ 14న మృతి చెందటంతో ఈ నియోజకవర్గానికి బుధవారం ఉప ఎన్నిక జరిగింది. డీఎంకే అభ్యర్థిగా చంద్రకుమార్, నామ్‌తమిళర్ కట్చి తరఫున సీతాలక్ష్మి పోటీ చేశారు. వీరితోపాటు మొత్తం 46 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. గత రెండు రోజులుగా ఈరోడ్ అంతటా ఎండలు విపరీతంగా కాయడంతో ఎండ పడకముందే ఓటేయాలని ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో 2లక్షల 27 వేల 546 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో లక్షా 10 వేల 128 మంది పురుషులు కాగా, లక్షా 17 వేల 381 మంది మహిళలున్నారు. ఈ ఓటర్ల కోసం 237పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను నియమించారు. బుధవారం పోలింగ్ ముగిసే సమయానికి 77.58 శాతం ఓట్లు పోలయినట్లు పేర్కొన్నారు. పోలింగ్ ముగియటంతో ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలకు సీలు వేశారు. ఆ తర్వాత పటిష్టమైన పోలీసు బందోబస్తు నడుమ ఈవీఎంలను చిత్తోడు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ నెల ఎనిమిదిన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నానికల్లా ఫలితాలను ప్రకటించనున్నారు.

వళయక్కార వీధిలో..

ఈరోడ్ వళయక్కార వీధిలోని పోలింగ్ కేంద్రాలలో ఓటు వేసేందుకు వెళ్లిన వారి ఓట్లు పోలైనట్లు అధికారులు ప్రకటించడంతో దిగ్భ్రాంతి చెందారు. ఫరీదాబేగం అనే మహిళ తన భర్తతోపాటు ఓటు వేయడానికి వెళ్లింది. పోలింగ్ కేంద్రంలో అధికారులు అప్పటికే ఆమె ఓటు పోలైనట్లు తెలిపారు. దీనితో తీవ్ర నిరాశ చెందిన ఫరీదాబేగం పోలింగ్ కేంద్రం బయట ఉన్న మీడియా ప్రతినిధులకు తన వద్దనున్న ఆధారాలు చూపి అధికారులు తన ఓటును ఎవరో వేశారని ఓటు వేయకుండా తనను తిప్పిపంపారని ఆరోపించారు.

ఉత్సాహంగా ఓటేసిన ఉత్తరాది ఓటర్లు...

ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన సుమారు ఏడువేలమంది స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరంతా ఎలక్ట్రిక్ షాపులు, సెల్‌ఫోన్, తాకట్టు, ఫర్నిచర్ దుకాణాలు నడుపుతున్నారు. గార్మెంట్స్, జౌళి దుకాణాల్లోనూ ఉద్యోగం చేస్తున్నారు. బుధవారం ఉదయం ఉత్సాహంగా ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.



తిరుప్పరంకుండ్రం
ప్రశాంతం

● మళ్లీ భక్తులకు అనుమతి

● నేడు దర్గాలో పూజలు : సెల్వపెరుంతగై

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుప్పరంకుండ్రంలో ప్రశాంత పరిస్థితులు నెలకొనటంతో బుధవారం ఉదయం నుండి భక్తులను ఆలయ దర్శనానికి, దర్గాకు అనుమతించారు. గత వారం రోజులుగా తిరుప్పరంకుండ్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరవై రోజుల క్రితం ఓ ముస్లిం యువకుడు కొండపై ఉన్న సికందర్ దర్గా వద్ద మేకపిల్లను బలిఇచ్చేందుకు ప్రయత్నించినప్పటి నుండి పర్వత ప్రాంతం, పర్వతం దిగువ ప్రాంతాల్లో ఉద్రిక్తవాతావరణం చోటుచేసుకుంది. ఆ తర్వాత రామనాథపురం ఎంపీ నవాజ్‌ఘనీ ఆ కొండపై దర్గా పరిశీలించేందుకు వెళ్ళినప్పుడు ఆయన అనుచరులు కొందరు బిర్యానీ ఆరగించారు. దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వెలువడటంతో రాష్ట్రంలో వీహెచ్‌పీ, హిందూ మున్నాని, బీజేపీ తదితర రాజకీయ పార్టీలు తీవ్ర ఆగ్రహం ప్రకటించాయి. హిందూ మున్నాని తిరుప్పరంకుండ్రం ప్రాంతం వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. పోలీసులు ఆ ధర్నాకు అనుమతి నిరాకరించడంతోపాటు తిరుప్పరంకుండ్రం నలువైపులా రహదారులను మూసివేశారు. సోమవారం నుండి మంగళవారం మధ్యాహ్నం వరకూ తిరుప్పరంకుండ్రం వద్ద ధర్నా చేయడానికి బయలుదేరిన హిందూమున్నానిని, వీహెచ్‌పీ, బీజేపీ శ్రేణులను అరెస్టు చేశారు. ఆ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ సాయంత్రం 5 నుండి 6 వరకు పళంగానత్తం ప్రాంతంలో హిందూ మున్నాని ధర్నాకు అనుమతులిచ్చింది. దీంతో మదురై పరిసర నగరాల నుండి మూడు సంస్థలకు చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పళంగానత్తం చేరుకుని నిరసన ప్రదర్శన చేశారు.

నేడు టీఎన్‌పీసీసీ నేత పూజలు..

ఇదిలా ఉండగా తిరుప్పరంకుండ్రంలో మతసామరస్యత నెలకొల్పేలా గురువారం ఆ కొండపై ఆలయం, దర్గా దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు టీఎన్‌పీసీసీ నేత సెల్వపెరుంతగై ప్రకటించారు.


తిరుప్పరంకుండ్రం పర్వతంపైకి వెళుతున్న భక్తులు


దర్గాకు వెళ్తున్న ముస్లింలు

నిబంధనలతో అనుమతి...

బుధవారం ఉదయం తిరుప్పరంకుండ్రం, మదురై, మేలూరు, పళంగానత్తం ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. కొండపై మురుగప్పెరుమాన్ ఆలయం, సికిందర్ ధర్గా దర్శించటానికి మాత్రమే భక్తులను అనుమతించారు. రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు, కార్యకర్తలు కొండమీదకు వెళ్లటానికి పోలీసులు అనుమతించలేదు. గత రెండు రోజులుగా మదురై జిల్లా అంతటా విధించిన 144వ నిషేధాజ్ఞలు ఉపసంహరించుకున్నారు. తిరుప్పరంకుండ్రం ప్రాంతంలో రెండు రోజులుగా మూసివేసిన అన్ని దుకాణాలను తెరిచారు. కొండపైకి ఆహార పదార్థాలను తీసుకెళ్లేందుకు మాత్రమే పోలీసులు అనుమతించారు. కృత్తిక, తైపూస వేడుకలు సమీపించడంతో బుధవారం ఉదయం నుండే పర్వతంపైని మురుగప్పెరుమాన్ దర్శినానికి భక్తులు బారులు తీరారు.

● బీజేపీ కుయుక్తులు ఫలించవు
మంత్రి పీకే శేఖర్‌బాబు

తిరుప్పరంకుండ్రం వివాదాన్ని రాజకీయ రంగు పులిమి డీఎంకే ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రయత్నిస్తున్నారని, వారి కుయుక్తులు ఎన్నటికీ ఫలించవని, రాష్ట్రంలో ముస్లింలు, హిందువులు సమైక్యంగా అన్నదమ్ములా మెలగుతున్నారని దేవాదాయ శాఖమంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. చెన్నైలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం తిరుప్పరం కుండ్రం వద్ద హిందూమున్నాని నేతలు, కార్యకర్తలు ఆందోళన జరపలేదని, బీజేపీ శ్రేణులే ధర్నాకు దిగాయని ఆరోపించారు. బీజేపీ ఎన్ని కుయుక్తులు పన్నినా అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవడం ఖాయమని అన్నారు.

మద్రాస్ హైకోర్టుకు
ఇద్దరు శాశ్వత న్యాయమూర్తులు

● సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా వున్న జస్టిస్ వెంకటాచారి లక్ష్మీ నారాయణన్, జస్టిస్ పెరియస్వామి వడమాలను శాశ్వత న్యాయమూర్తులు నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రప్రభుత్వానికి బుధవారం సిఫారసు చేసింది. దీనిని పరిశీలించిన కేంద్రప్రభుత్వం.. రాష్ట్రపతికి సిఫారసు చేయనుంది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం వారు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులు కానున్నారు. వీరిద్దరూ ఏడాదిగా అదనపు న్యాయమూర్తులుగా వ్యవహరిస్తున్నారు. కాగా ప్రస్తుతం హైకోర్టులో 75 మంది న్యాయమూర్తులకు 65 మంది న్యాయమూర్తులున్నారు.


జస్టిస్ వెంకటాచారి లక్ష్మీ నారాయణన్


జస్టిస్ పెరియస్వామి వడమాల

మెరీనాలో 'స్మార్ట్ పార్కింగ్'

● జీసీసీ చర్యలు

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి పొడవైన, సుందరమైన రెండో బీచ్‌గా పేరుగాంచిన మెరీనా తీరంలో 'స్మార్ట్ పార్కింగ్ పథకాన్ని ప్రారంభించేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. రాజధాని నగరంలో ప్రధానమైన మెరీనాబీచ్ శని, ఆదివారాలు, ప్రభుత్వ సెలవు రోజులు, పండుగ రోజుల్లో సందర్శకులతో కిటకిటలాడుతుంటుంది. మెరీనా ఈత కొలను నుంచి మైలాపూర్ ఆలిండియా రేడియో కేంద్రం సమీపంలో ఉన్న లైట్‌హౌస్ వరకు ఉన్న మార్గంలో మూడు ప్రాంతాల్లో మాత్రమే వాహనాలను పార్కింగుకు అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెరీనా సర్వీస్ రోడ్‌లో వాహనాల్లో వచ్చే వారు అక్కడక్కడే వాహనాలను పార్కింగ్ చేయడంవల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేలా జీసీసీ కార్పొరేట్ సంస్థల ద్వారా పార్కింగ్ చేసే వాహనాల ఫీజు వసూళ్ల బాధ్యత అప్పగించింది. అయితే ఈ విధానం సక్రమంగా అమలు జరగకపోవడంతో పార్కింగ్ ఫీజ్ వసూళ్ల విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.

ఇదిలా ఉండగా, నగరంలోని ప్రధాన వాణిజ్య కేంద్రాల్లో లాగే, మెరీనాతీరంలో స్మార్ట్ పార్కింగ్ పథకాన్ని అమలుపరచేందుకు జీసీసీ ముందుకు వచ్చింది. మెరీనా సర్వీస్ రోడ్డులో వాహనాలతో వచ్చే వారు పార్కింగ్ టికెట్ తీసుకుని, తిరిగివెళ్లే సమయంలో ఆ టికెట్టు చూపించి, ఎంత సమయం వాహనం నిలిపారో అంతవరకు ఫీజు చెల్లించాల్సివుంటుంది. ఇందుకోసం మెరీనాతీరంలో వరకు ఉన్న ఐదు ప్రవేశ ద్వారాల్లో స్మార్ట్ మీటర్లు పొందుపరుస్తున్నారు. ఏప్రిల్ నుండి ఈ పథకం అమల్లోకి వస్తుందని జీసీసీ అధికారులు తెలిపారు.

అన్నాడీఎంకేలో యువరక్తం

● అసెంబ్లీ ఎన్నికలకు ఈపీఎస్ సరికొత్త వ్యూహం

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభకు వచ్చే యేడాది జరుగనున్న ఎన్నికల్లోగా పార్టీకి నూతన జవసత్వాలు కల్పించాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యూహరచన చేస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లకు పైగా గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ధీమా వ్యక్తం చేస్తుండగా, రాష్ట్ర ప్రజలంతా డీఎంకే అవినీతి పాలనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారంటూ ఈపీఎస్ అంటున్నారు. ఈ సారి శాసనసభ ఎన్నికల్లో పార్టీని గెలిపించి పూర్వవైభవం కల్పించాలని ఆయన కంకణం కట్టుకున్నారు. ఆ దిశగా పార్టీలో విప్లవాత్మక మార్పులు చేపట్టాలని నిర్ణయించారు. ముఖ్యంగా పార్టీలోని యువజన విభాగం, మహిళా విభాగంలో యువతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ మేరకు రెండు విభాగాల్లో యువతీ యువకులకు సభ్యత్వం కల్పించాలని పార్టీ ప్రముఖులు, జిల్లా శాఖ నేతలకు ఆదేశించారు. అదే సమయంలో పార్టీకి ఎలాంటి సేవ చేయకుండా ఇంటిలోనే ఉంటున్నవారిని పార్టీ నుండి తొలగించాలని కూడా భావిస్తున్నారు. మంగళవారం చెన్నై జిల్లాకు చెందిన కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ విజయభాస్కర్ పార్టీని పటిష్టపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఈపీఎస్ దృష్టికి తీసుకెళ్ళారు. చెన్నై నగర పరిధిలోని జిల్లా శాఖ నేతలు విరుగై రవి, మాజీ మంత్రి వలర్మతి, కమలకన్నన్ హాజరయ్యారు. ఇదే విధంగా మాజీ మంత్రి సెమ్మలై, జిల్లా శాఖ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొని మాజీ ముఖ్యమంత్రి జయలలిత హాయంలో మహిళా విభాగం, యువజన విభాగం చాలా చురుకుగా పనిచేసేదని, ప్రస్తుతం ఈ రెండు విభాగాల పనితీరు సంతృప్తికరంగా లేదని, ఈ విభాగాల్లో యువతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఈపీఎస్‌కు సూచించారు. దానికి ఈపీఎస్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆ మేరకు జిల్లా కార్యదర్శులందరూ వారి పక్క జిల్లాల్లో పర్యటించి రెండు విభాగాలకు యువతీ యువకులకు సభ్యత్వం కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని, అదే సమయంలో ఆ విభాగాల్లో చురుకుగా పనిచేస్తున్నవారిని ప్రోత్సహించి వారికి పార్టీపరంగా పదోన్నతి కల్పించాలని, సోమరితనంగా వ్యవహరిస్తూ పార్టీకి భారమైనవారిని ఇంటికిసాగనంపాలని కూడా ఈపీఎస్ మౌఖిక ఉత్తర్వులిచ్చారు. పార్టీలోని ఇళమ్ పెన్‌గళ్‌పాసరై (మహిళా విభాగం), ఇళంజర్ పాసరై (యువజన విభాగం)కి పూర్వ వైభవం కల్పించాలని ఈ రెండు విభాగాలలో 25 నుండి 30 యేళ్లలోపు యువతీ యువకులకు సభ్యత్వం కల్పించాలని పేర్కొన్నారు. ఈ విషయమై మాజీ మంత్రి సెమ్మలై మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎంకే పాలనలో అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని, ఈ విషయం వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో తేటతెల్లం కానుందని చెప్పారు. పార్టీ సీనియర్ నేత డి.జయకుమార్ మాట్లాడుతూ పార్టీలో చేరేందుకు యువతీ యువకులు కూడా ఆసక్తికనబరుస్తున్నారని, శాసనసభ ఎన్నికలలోపు ఇళంపెణ్‌గళ్‌పాసరై, ఇళంజర్‌పాసరై విభాగాలను పటిష్టపరచాల్సిన అవసరం ఉందని, ఆ దిశగానే పార్టీ నేత ఈపీఎస్ వ్యూహరచన చేస్తున్నారని చెప్పారు.


ఇటీవల విల్లుపురం జిల్లా వళుతొట్టి గ్రామం వద్ద సామాజిక న్యాయం కోసం పోరాడిన అమరవీరుల స్మారక మండపం ప్రారంభించినందుకు చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపి సత్కరిస్తున్న పీఎంకే దివంగత నేత కాడువెట్టి గురు కుటుంబ సభ్యులు, పార్టీ ప్రముఖులు

రియల్ ఎస్టేట్ యజమాని ఇంట్లో
ఐటీ, ఈడీ సోదాలు

● రూ.అరకోటి స్వాధీనం

అడయార్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటకు చెందిన రియల్ ఎస్టేట్ యజమాని యాకూబ్ నివాసంలో ఆదాయపన్ను శాఖతో పాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు రెండో రోజైన బుధవారం కూడా తనిఖీలు కొనసాగించారు. ఈ తనిఖీ సమయంలో ఇంటిలో లభ్యమైన కీలక పత్రాలను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి మొత్తం సోదా చేయగా, లెక్కల్లో చూపని రూ.50 లక్షలను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎన్ఐఏ అధికారులు ఈ రూ.50 లక్షలకు సంబంధించి లోతుగా ఆరా తీశారు. ఈ తనిఖీలు మంగళవారం రాత్రి ప్రారంభమై, బుధవారం ఉదయం వరకూ కొనసాగాయి. రియల్ ఎస్టేట్ యజమాని నివాసంలో ఒకేసారి ఐటీ, ఎన్ఐఏ అధికారులు కలిసి సోదాలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తిరువేర్కాడు: కుమరన్ నగర్ ఎమ్జీ రోడ్డు, తిరువలీశ్వరర్ నగర్, కలైవారన్ నగర్, శక్తి నగర్, అమ్మన్ నగర్, తంబి సామి నగర్, రాజరత్నం నగర్, పెరుమాళ్ అగరం రోడ్డు, పల్లవన్ నగర్, శాంతి వీధి, ఎంజీఆర్ నగర్, తిరుమలై బాలాజీ నగర్

చెందూర్‌పురం: మౌంట్ పూందమల్లి రోడ్డు, పిళ్లయార్ ఆలయ వీధి, మురుగన్ ఆలయ వీధి, జేజే నగర్, అమ్మన్ నగర్, పీజీ అవెన్యూ, ఇందిరా నగర్, జానకిఅమ్మాళ్ నగర్, శాయి నగర్, వినాయగపురం, స్వర్ణపురి నగర్

పోరూర్: గెరుగంబాక్కం, కోలపాక్కం, సభాపతి నగర్, చక్రపాణి నగర్, శ్రీ పురం, బీటీ నగర్, శంకరలిగానర్ వీధి, వీజీఎన్, విఘ్నేశ్వర నగర్, మంజు ఫౌండేషన్, రాజగోపాలపురం, మదనాందపురం, హిమాచల్ నగర్, సంతోష్ నగర్, రాణీజీ నగర్, ముత్తుమారి అమ్మన్ వీధి

రెడ్‌హిల్స్: జ్యోతి నగర్, మహామేరు నగర్, వడివేలు నగర్, బాలాజీ నగర్, మహాలక్ష్మి నగర్, కలాపగ నగర్

'క్యాట్-బి' పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పీజీ బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'క్యాట్-బి' ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20వ తేది జరుగనుందని ఎన్టీఏ తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో పీజీ బయోటెక్నాలజీ కోర్సుల్లో చేరేందుకు 'క్యాట్-బి' ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ పరీక్షను ప్రతి ఏడాది జాతీయ పరీక్ష ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహిస్తుంది. ఆ ప్రకారం ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన క్యాట్-బి ప్రవేశపరీక్ష ఏప్రిల్ 20వ తేది ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నారు. ఆ పరీక్షకు హాజరు కావాలనుకొనే అభ్యర్థులు https://dbt2025.ntaonline.in/ అనే వెబ్‌సైట్ ద్వారా మార్చి 3వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. పరీక్షా ఫీజుగా జనరల్ విభాగం అభ్యర్థులు రూ.1,300, ఎస్సీ, ఎస్టీ విభాగాల అభ్యర్థులు రూ.650 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, దరఖాస్తులో లోపాలున్నట్లయితే మార్చి 5,6 తేదీల్లో సవరించుకోవచ్చు. పరీక్ష సిలబస్, అర్హత, విధి విధానాలను /www.nta.ac.in/ అనే వెబ్‌సైట్ ద్వారా, ఏవైనా సందేహాలుంటే 011-40759000 అనే నెంబరు సంప్రదించవచ్చని ఎన్టీఏ తెలియజేసింది.

'ఇగ్నో' దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఇగ్నో విశ్వవిద్యాలయం దూరవిద్య ద్వారా ఆర్ట్స్, సైన్స్, కామర్స్, జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్, లా, మేనేజ్‌మెంట్, సోషల్ సైన్స్ పాఠ్యాంశాలలో యూజీ, పీజీ, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులు అందజేస్తోంది. ఈ ఏడాది జనవరి సెమిస్టర్‌కు సంబంధించిన దరఖాస్తు స్వీకరణ గత జనవరి 31వ తేదీతో ముగియగా, ఈ గడువును ఈ నెల 15వ తేది వరకు పొడిగించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https://ignouadmission.samarth.edu.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలి. మరిన్ని వివరాలకు www.ignou.ac.in అనేవెబ్‌సైట్ సంప్రదించవచ్చని ఇగ్నోచెన్నై మండల డైరెక్టర్ పన్నీర్‌సెల్వం ప్రకటనలో తెలిపారు.

నేడు మనలి ఏరియాలో తాగునీటి సరఫరా నిలిపివేత

అడయార్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మనలి జోన్ పరిధిలో 12 గంటల పాటు తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్టు చెన్నై మెట్రోవాటర్ బోర్డు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. మనలి జోన్‌లోని తాగునీటి సరఫరా పైపుల మార్పు, మరమ్మతులు, పైపుల అనుసంధానం, ఇతర పనుల కారణంగా ఈ నెల 6వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 6 గంటల వరకు తాగునీటి సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొంది. మరిన్ని వివరాలకోసం 044-4567 4567 అనే నంబరులో సంప్రదించవచ్చని కోరింది.

రేపు ఎస్కేడీటీ పాఠశాల వార్షికోత్సవం

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కం నియోజకవర్గంలోని శ్రీకనక దుర్గ తెలుగు హైయర్ సెంకడరీ పాఠశాల (ఎస్కేడీటీ) 78వ వార్షిక, క్రీడా దినోత్సవాలు వచ్చే శుక్రవారం జరగనుంది. ఎస్కేడీటీ పాఠశాలల అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 5గంటలకు పాఠశాల ప్రాంగణంలో ప్రారంభం కానున్న ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, వైద్యశాఖా మంత్రి వై సత్యకుమార్, ప్రత్యేక అతిథులుగా విల్లివాక్కం ఎమ్మెల్యే వెట్రి అళగన్, నెల్లూరు ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్ కుమార్, ఎస్కేడీటీ పాఠశాల ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహకులు డాక్టర్ సీఎం కిషోర్ తదితరులు పాల్గొననున్నారు. ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీ నేపథ్య గాయకులు ఎం.రాము పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు పంపిణీ చేస్తారని పాఠశాల కార్యదర్శి పోరూరి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు కె.శారా సుహాసిణి, సహాయ ప్రధానోపాధాయులు ఎం.మోహన్ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.

బాణసంచా కర్మాగారంలో పేలుడు

● మహిళ మృతి, ఏడుగురికి గాయాలు

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లాలో బాణసంచా కర్మాగారంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో మహిళా కార్మికురాలు మృతి చెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. కోవిల్‌పులికుత్తి ప్రాంతంలో మోహన్‌రాజ్‌కు బాణా సంచా కర్మాగారం ఉంది. బుధవారం కార్మికులు యధావిధిగా టపాసుల తయారీకి వచ్చారు. ఓ గదిలో రసాయనాల మిశ్రమంలో హఠాత్తుగా అగ్నిప్రమాదం సంభవించింది. ఆ సమయంలో మిగిలిన గదుల్లోని కార్మికులు బయటకు పరుగులు తీశారు. మంటలు ఇతర గదులకు వ్యాపించి బాణసంచా పెద్ద శబ్దంతో పేలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొనేలోపు ఐదు గదులు నేలమట్టమయ్యాయి. శిధిలాల కింద చిక్కుకొని ఓ మహిళ మృతిచెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



నేలమట్టమైన కర్మాగారం

భార్యను సంసారానికి పంపలేదని చిన్నత్తను కత్తితో పొడిచిన యువకుడు

అడయార్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తన భార్యను సంసారానికి పంపించేందుకు నిరాకరించిన పిన్నమ్మను ఓ యువకుడు కత్తితో పొడిచి పారిపోయాడు. ఈ ఘటన తిరువొట్రియూరు, అయ్యాపిళ్లై గార్డెన్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అన్బళగన్ కుమార్తె తమిళ్ సెల్విని తిరుపూరుకు చెందిన కాళిముత్తు అనే యువకుడికి ఇచ్చి గత యేడాది వివాహం చేశారు. వీరంతా కలిసి చెన్నైలో ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నారు. అయితే, కాళిముత్తుకు తన భార్య ప్రవర్తనపై సందేహించి అనేక షరతులు పెట్టి హింసించసాగాడు. సమస్య పెద్దది కావడంతో కాళిముత్తు తిరుపూరు వెళ్ళిపోయాడు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం నగరానికి వచ్చిన కాళిముత్తు తన భార్యను సంసారానికి పంపించాలని పట్టుబట్టాడు. దీనికి తమిళ్ సెల్వి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. అదే వీధిలో ఉండే తన పిన్ని ధనలక్ష్మి (50) ఇంటికి తమిళ్ సెల్వి వెళ్ళింది. దీంతో మరింత ఆగ్రహించిన కాళిముత్తు... ఆమె ఇంటికి వెళ్ళి మరోమారు బ్రతిమలాడగా, తమిళ్‌సెల్విని పంపించేందుకు ధనలక్ష్మి నిరాకరించింది. దీంతో ధనలక్ష్మిని కత్తితో పొడిచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. పరారీలో ఉన్న కాళిముత్తు కోసం గాలిస్తున్నారు.

కానిస్టేబుల్ కాలు విరగ్గొట్టిన ఖాకీలు

అడయార్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బదిలీ ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన ముగ్గురు కానిస్టేబుళ్ళు తోటి కానిస్టేబుల్‌ను చితకబాది కాలు విరగ్గొట్టారు. ఈ సంఘటన ఎగ్మోర్ రాజారత్నం స్టేడియం వద్ద జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు అంతర్గత విచారణకు ఆదేశించారు. పోలీస్ శాఖలో రంగనాథన్, ఆనంద్, సుందరరాజన్, మణిబాబులు మదురై సాయుధ విభాగంలో పనిచేసే సమయం నుంచి మంచి స్నేహితులు. ఈ క్రమంలో రంగనాథన్... తన బదిలీ కోసం సుందరరాజన్ దగ్గర ప్రస్తావించాడు. ఆయన తనకు తెలిసిన ఉన్నతాధికారుల ద్వారా బదిలీ ఉత్తర్వులు తెప్పిస్తానని, ఇందుకోసం కొంత ఖర్చుఅవుతుందన్నాడు. దీనికి రంగనాథన్ కూడా ఒప్పుకున్నాడు. ఆ తర్వాత సుందరరాజన్ చెప్పినట్టుగానే ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు తెప్పించాడు. ఆ తర్వాత ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు డబ్బులు ఇచ్చేందుకు రంగనాథన్ నిరాకరించాడు. దీంతో సుందరరాజన్, ఆనంద్, మణిబాబులతో కలిసి రంగనాథన్‌ను చితకబాదడంతో కాలు విరిగింది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో ఆ ముగ్గురు పోలీసులను విచారణ జరుపుతున్నారు.

అత్యాచారం కేసులో 20ఏళ్ల జైలు శిక్ష రద్దు

● మద్రాస్ హైకోర్టు ఉత్తర్వు

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాలికను అత్యాచారానికి గురిచేసిన కేసులో ఆటో డ్రైవర్‌కు విధించిన 20ఏళ్ల జైలు శిక్షను రద్దు చేస్తూ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. జైలు శిక్ష నిలుపుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన ధర్మాసనం ముందు హాజరైన ఆటో డ్రైవర్ కారణంగా నష్టపోయిన బాధితురాలు తమకు వివాహం జరిగి బిడ్డకూడా వుందని, ముత్తుకుమార్‌తో సంసారం చేయాలని తాను ఆశిస్తున్నట్లు తన మనసులోని అభిప్రాయం చెప్పింది. ఆమె అభ్యర్థన అంగీకరించిన న్యాయస్థానం అత్యాచారానికి సంబంధించిన ఆధారాలు లేవనే కారణంగా 20ఏళ్ల జైలు శిక్షను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.5 వేలు లంచం కేసులో వీఏవో, సర్వేయర్లపై సస్పెన్షన్ వేటు

అడయార్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లాలో భూమి సర్వే చేసేందుకు రూ.5 వేలు లంచం పుచ్చుకున్న వీఏవో, సర్వేయర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి సస్పెండ్ చేశారు. నామక్కల్ జిల్లా ఎర్నాపురంకు చెందిన తిరుమురుగన్ తన భార్యకు పుట్టింటివారు దానంగా ఇచ్చిన భూమి సర్వే చేయించేందుకు స్థానిక సర్వేయర్ అశోక్ కుమార్, వీఏవో వేలుస్వామిలను సంప్రదించగా వారు రూ.5 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆయన ఏసీబీ అధికారులను సంప్రదించారు. వెంటనే రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు వలపన్ని అశోక్ కుమార్, వేలుస్వామి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. దీంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం వారిద్దరిని సస్పెండ్ చేసింది.

500కిలోల గుట్కా స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన గుట్కా కారులో అక్రమంగా నగరానికి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 500కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్నారు. పొరుగు రాష్ట్రాల నుండి కొంతమంది చట్టవిరుద్ధంగా గుట్కా, హన్స్ తదితర పొగాకు పదార్థాలను నగరానికి తరలిస్తున్నట్లు ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్‌కు అందిన సమాచారంతో ఆయన పోలీసులను అప్రమత్తం చేశారు. మంగళవారం పూందమల్లి జంక్షన్‌లో పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా అటువైపు వస్తున్న కారును ఆపి తనిఖీలు చేశారు. కారులో తరలిస్తున్న 500కిలోల పొగాకు ఉత్పత్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలించిన రాజస్థాన్‌కు చెందిన దినేష్, రావత్ రామ్ చౌదరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచిన అనంతరం పుళల్ జైలుకు తరలించారు.

బస్సు కింద నలిగి యువకుడి మృతి

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలో ఎంటీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆలందూర్‌కు చెందిన ప్రవీణ్(35) బుధవారం ఉదయం 9.30గంటలకు బైక్‌పై తేనాంపేటలోని ఆనంద హోటల్ సిగ్నల్ దాటి వెళ్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన బుల్లెట్ వేగంగా ఢీకొనడంతో ప్రవీణ్ కింద పడిపోయాడు. ఆ సమయంలో ట్రాఫిక్ సిగ్నల్ క్రాస్‌చేస్తున్న 11జీ నెంబరు ఎంటీసీ బస్సు ప్రవీణ్ తలమీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు బుల్లెట్ నడిపిన శివం(36), ఎంటీసీ బస్సు డ్రైవర్ రాజేంద్రన్(52)లను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. ప్రమాదం కారణంగా తేనాంపేట జంక్షన్‌లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అలంకరణ సామగ్రి గోదాములో భారీ అగ్ని ప్రమాదం

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కరట్టళగన్‌పట్టిలో చిన్నాలంపట్టికి చెందిన విగ్నేష్ అనే వ్యక్తి నడుపుతున్న వివాహ అలంకరణ సామగ్రి గోదాములో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ గోదాము నుంచి దట్టమైన పొగలు రావడం చూసి స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన అక్కడికి ఫైరింజన్‌తో వెళ్ళి అగ్నిమాపక దళం మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో గోదాములో లక్షలాది రూపాయల విలువ



గోదాము నుంచి వస్తున్న పొగలు

చేసే అలంకరణ సామగ్రి, ఫర్నిచర్, సెట్టింగులు కాలి బూడిదయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని అప్పాదురై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మళ్లీ సమ్మెబాట పట్టిన సామ్‌సంగ్ కార్మికులు



పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సామ్‌సంగ్ కర్మాగారంలో ముగ్గురు కార్మికులను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ, 500 మందికి పైగా కార్మికులు సమ్మె చేపట్టారు. కాంచీపురం జిల్లా సుంకువాసత్రం సమీపంలో సామ్‌సంగ్ కర్మాగారంలో శాశ్వత, ఒప్పంద కార్మికులు సుమారు 3వేల మందికి పైగా పనిచేస్తున్నారు. కర్మాగారంలో కార్మిక సంఘం ఏర్పాటు చేయాలని కోరుతూ కార్మికులు 36 రోజులు సమ్మెబాట పట్టారు. ప్రభుత్వ చర్చల అనంతరం కార్మికులు సమ్మె విరమించుకుని విధులకు హాజరయ్యారు. అనంతరం గత నెల 27వ తేది సీఐటీయూ కార్మిక సంఘం రిజిస్టర్ చేశారు. ఈ క్రమంలో, సీఐటీయూ కార్మిక సంఘానికి చెందిన ముగ్గురిని యాజమాన్యం సస్పెండ్ చేసింది. సస్పెన్షన్‌కు గురైన మోహన్‌రాజ్, శివనేశన్, గుణశేఖరన్‌లు ముగ్గురు సీఐటీయూ కార్మిక సంఘ ముఖ్య నేతలు. యాజమాన్యం తీరును ఖండిస్తూ 500 మందికి పైగా కార్మికులు బుధవారం సమ్మె చేపట్టారు. యాజమాన్యం నిరంకుశ ధోరణికి పాల్పడుతోందని, సస్పెన్షన్ ఉపసంహరించుకొనే వరకు తాము సమ్మె విరమించేది లేదని సీఐటీయూ కార్మిక సంఘం స్పష్టం చేసింది.

విరుదునగర్‌లో లారీ బోల్తా

● డ్రైవర్ సహా ఇద్దరికి గాయాలు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ రాష్ట్ర రవాణా సంస్థ కార్యాలయం సమీపం మదురై -తిరునల్వేలి జాతీయ రహదారిలో కేరళ నుండి అగ్గిపుల్లల లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ హమీద్ (58), క్లీనర్ గాయపడ్డారు. ఆరుటన్నుల అగ్గిపుల్లలతో కేరళ నుంచి శివకాశికి బయల్దేరిన ఆ లారీకి విల్లుపురం వద్ద ఆటో అడ్డంగా వచ్చిదిఇ. డ్రైవర్ పక్కకు మళ్ళించేందుకు ప్రయత్నించడంతో అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. స్థానికులు గమనించి లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌ను బయటకుతీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ జాతీయ రహదారిలో గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

● ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్ రాజు

● ఘనంగా ప్రభుత్వ పాఠశాల స్నాతకోత్సవం



భాస్కర్‌రాజు దంపతులను సత్కరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తిరుత్తణి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని నేడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్ రాజు దంపతులను విద్యార్థుల తల్లిదండ్రులు సత్కరించారు. అనంతరం భాస్కర్ రాజు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, పెద్దలను ఎంత గౌరవిస్తే అంత ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ యాక్టింగ్ ప్రిన్సిపాల్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హిందూ తమిళర్ కట్చి అధ్యక్షుడిపై గూండా చట్టం

అడయార్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో అనేక మందికి అప్పులు ఇచ్చి అధిక వడ్డీలను వసూలు చేయడంతోపాటు పలువురు మహిళలను వేధించిన కేసులో హిందూ తమిళర్ కట్చి జిల్లా అధ్యక్షుడు శాంతరాజన్‌పై జిల్లా కలెక్టర్ అళగు మీనా గూండా చట్టాన్ని ప్రయోగించారు. జిల్లా ఎస్పీ స్టాలిన్‌కు వచ్చిన అనేక ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత శాంతరాజన్‌ను గూండా చట్టం కింద అరెస్టు చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. కాగా శాంతరాజన్ ఆయన అనుచరులు రాజేష్, అంబిలి కన్నన్, సతీష్ అనే వారిని పోలీసులు అరెస్టు చేసి నాగర్‌కోయిల్ జైలుకు తరలించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి లోబడి గవర్నర్ ఉండాల్సిందే!

● మంత్రి రఘుపతి వ్యాఖ్య

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వానికి గవర్నర్ కట్టుబడి వుండాల్సిందేనని రాష్ట్ర న్యాయశాఖామంత్రి రఘుపతి వ్యాఖ్యానించారు. రాష్ట్ర గవర్నర్ రాజ్యాంగ ధర్మాన్ని గౌరవించేలా ఆయా రాష్ట్రప్రభుత్వాలకు కట్టుబడి పని చేయాల్సిందేనని ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల తన ఎక్స్‌పేజీలో పోస్టు చేశారు. దానిపై తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ఎలాంటి సమాధానం చెప్తారని మంత్రి రఘుపతి ప్రశ్నించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవానికి గవర్నర్‌ను ఆహ్వానించారని, అయితే గవర్నర్ సభా హక్కులను ఉల్లంఘించి, ప్రసంగించకుండానే అసెంబ్లీ నుండి వెళ్లిపోయారని మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్లు కట్టుబడి పనిచేయాల్సిందేనన్న న్యాయపరమైన వాస్తవాన్ని ప్రధాని నరేంద్రమోదీ అంగీకరించారని, ఇందుకు గవర్నర్ ఏమి బదులిస్తారని మంత్రి ప్రశ్నించారు.

హిజ్రాలకు తోపుడు టిఫిన్ బండ్లు



తోపుడు బండి అందజేస్తున్న దృశ్యం

అడయార్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక కార్యకర్త, ది గుడ్ డీడ్ క్లబ్ వ్యవస్థాపకురాలు అప్సరా రెడ్డి ఎర్నావూరులోని హిజ్రాలకు 116 తోపుడు టిఫిన్ బండ్లను పంపిణీ చేశారు. తాను ప్రారంభించిన డిగ్నిటీ ప్రాజెక్టుద్వారా ఎంతో మంది హిజ్రాలు స్వయం ఉపాధి పొందేలా అప్సరా రెడ్డి సహాయం చేస్తున్నారు. ట్రాన్స్‌జెండర్లు స్వయం ఉపాధి ఆర్థికాభివృద్ధితో పాటు సాధికారత సాధించేందుకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా 200 మంది హిజ్రాలకు ఆమె వివిధ రకాల కిరాణా సరకులను అందజేశారు. అలాగే, ఎర్నావూరు ప్రాంతంలో 116మంది హిజ్రాలకు తోపుడు టిఫిన్ బండ్లను పంపిణీ చేశారు. గుడ్ డీడ్స్ క్లబ్ సభ్యులు ఎం.కన్నదాసన్ మూర్తి తదితరులుపాల్గొన్నారు.

నేటినుంచి వివేకానంద నవరాత్రి ఉత్సవాలు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాబీచ్‌లోని వివేకానంద ఇల్లమ్‌లో ఈ నెల 6 నుండి 14 వరకు వివేకానంద నవరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు చెన్నై శ్రీరామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి సత్యజ్ఞానానంద తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఎలుగెత్తి చాటి, స్వదేశానికి తిరిగొచ్చిన స్వామి వివేకానంద మద్రాసు నగరంలో 1897 ఫిబ్రవరి 6నుండి 14 వరకు వివేకానందర్ ఇల్లమ్‌లో బసచేసి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారని, ఆనాటి సంఘటనలను భావితరాలకు తెలియజేసేలా ప్రతియేటా వివేకానంద నవరాత్రి వేడుకలను జరుపుతున్నామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5.30 నుండి రాత్రి 8.30 వరకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, నగర ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గురువారం సాయంత్రం చెన్నై మఠం మేనేజర్ స్వామి రఘునాయకానంద స్వాగతోపన్యాసంతో ప్రారంభమయ్యే తొలి రోజు వేడుకల్లో నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఎం.ప్రసన్నకుమార్ గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించనున్నారని తెలిపారు. వివేకానంద ఇల్లం ఇన్‌ఛార్జి స్వామి ఈశ ప్రేమానంద వందన సమర్పణ చేస్తారు.

మున్సిపాలిటీలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ

కార్తికేయపురంవాసుల ధర్నా

తిరుత్తణి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా మేజిస్ట్రేట్ వ్యక్తిగత సహాయకుడు సంతానం సమక్షంలో సుమారు 500మంది మహిళలు గ్రామ విలీనాన్ని వ్యతిరేకిస్తూ నిరసనచేపట్టారు. వివరాలిలా... తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి యూనియన్ పరిధిలోని కార్తికేయపురం పంచాయతీలో ఏడువేల మందికి పైగా నివసిస్తున్నారు. ఈ గ్రామంలోని ప్రజలంతా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం ఈ గ్రామాన్ని తిరుత్తణి మున్సిపాలిటీలో విలీనం చేయాలని నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్థులంతా బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరిపారు. కార్తికేయపురాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయడం తమకు ఇష్టం లేదని ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



పంచాయతీ విలీనాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్థుల నిరసన

మార్చి నుంచి చెన్నై-ఘజియాబాద్ విమాన సేవలు

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై నుంచి ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లో ఉన్న హిండన్ విమానాశ్రయానికి మార్చి నుంచి నేరుగా విమాన సేవలు అందించనున్నట్లు 'ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్' తెలిపింది. ఆ ప్రకారం, మార్చి 23వ తేది నుంచి ప్రతిరోజు చెన్నై నుంచి ఉదయం 5.55 గంటలకు బయల్దేరే విమానం 9.05 గంటలకు హిండన్ చేరుకుంటుంది. మరుమార్గంలో హిండన్ నుంచి మధ్యాహ్నం 3.20 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.05 గంటలకు చెన్నై చేరుకుంటుంది. ఈ విమానాలు 'బోయింగ్ 737' రకానికి చెందినవి ఆ సంస్థ అధికారులు తెలిపారు.

వేట నిరోధక సిబ్బంది వేతనం పెంపు

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వేట నిరోధక సిబ్బంది వేతనం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగ ఉన్న అడవుల్లో వన్యమృగాలు, పక్షులు వేటగాళ్ల బారి నుంచి రక్షించేలా వేట నిరోధక విభాగం పనిచేస్తోంది. ఈ విభాగంలో 669 మంది ఉన్నారు. వీరికిచ్చే నెలవారీ వేతనం రూ.2,500 నుంచి రూ.15,625కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

భిక్షగాళ్ల గణన ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో భిక్షగాళ్ళు, నిరాశ్రయుల గణన ప్రారంభమైంది. ఏడేళ్ల అనంతరం మెడ్రాస్ స్కూల్ ఆఫ్ సోషియల్ వర్క్ సహకారంతో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) 200 వార్డుల్లో గణన చేపట్టింది. ఈ విషయమై జీసీసీ అధికారి మాట్లాడుతూ... 2018లో నిర్వహించిన గణన ప్రకారం 11వేల మంది ఇళ్లు లేని వారుండగా, 2022 గణన ప్రకారం 10,300 మంది ఉన్నారన్నారు. వీరికి 49 ప్రాంతాల్లో ఆశ్రయం కల్పించామన్నారు. గతంలో చేపట్టిన గణనలో నిరాశ్రయుల్లో 50 శాతం మంది బ్రాడ్‌వే, ప్యారీస్, రాయపురం, టి.నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్నారని తెలిపారు. వీరికి ఆశ్రయం కల్పించేందుకు 83 వసతి కేంద్రాలు అవసరం కాగా ప్రస్తుతం 53 మాత్రమే ఉన్నాయని తెలిపారు. మానసిక స్థితి సరిగా లేని కొందరు పూర్తికాలం భిక్షాటన చేస్తున్నారని, వారిలో కొందరు రాత్రి వేళ రోడ్ల పక్కనే నివసిస్తున్నారని అధికారి తెలిపారు.

జరిమానాతో 19 మంది జాలర్ల విడుదల

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన వారిలో 19 మంది జాలర్లు విడుదలయ్యారు. సరిహద్దులు దాటి చేపలు వేటాడుతున్నారని ఆరోపిస్తూ గత నెల 26వ తేది రామేశ్వరానికి చెందిన 34 మంది జాలర్లను అరెస్ట్ చేసిన లంక నావికాదళం, వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. అరెస్టయిన 34 మంది జాలర్లను బుధవారం కోర్టులో హాజరుపరిచారు. వారిలో 19 మందిని మాత్రం నిబంధనలతో విడుదల చేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఆ ప్రకారం, విడుదల చేసిన 19 మందిలో 16 మందికి తలా రూ.50వేలు జరిమానా, పడవ నడిపిన ముగ్గురు జాలర్లకు తలా రూ.60.5 లక్షల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 16మంది ఆరు నెలలు, ముగ్గురు ఏడాది జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. అదే సమయంలో మిగిలిన 15 మంది జాలర్ల పడవ నెంబరు తప్పుగా ఉందంటూ వారిని విడుదల చేసేందుకు శ్రీలంక న్యాయస్థానం నిరాకరించింది. తదుపరి విచారణ ఈ నెల 10వ తేదికి న్యాయమూర్తి వాయిదా వేశాశారు. ఈ నేపథ్యంలో, విడుదలైన 19 మందిని రాష్ట్రానికి తీసుకొచ్చేలా శ్రీలంకలోని భారత దౌత్యాధికారి కార్యాలయం చర్యలు చేపట్టింది. మరో రెండు, మూడు రోజుల్లో జాలర్లు రాష్ట్రానికి చేరుకుంటారని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 22 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ జరిగింది. నగర పోలీస్ కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిని పరిశీలించి సత్వరం చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలు ఈ గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

ముస్లింలు, క్రైస్తవుల కొమ్ముకాస్తున్న డీఎంకే

● రాష్ట్ర బీజేపీ విమర్శ

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముస్లింలు, క్రైస్తవుల ఓట్ల కోసం అధికార డీఎంకే వారికి కొమ్ముకాస్తోందని బీజేపీ రాష్ట్ర విభాగం విమర్శించింది. టి.నగర్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం కమలాలయంలో ప్రచార కమిటీ విభాగం నాయకుడు ఏఎన్ఎస్ ప్రసాద్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముస్లింలు, క్రైస్తవుల ఓటు బ్యాంకు కోసం డీఎంకే ప్రభుత్వం హిందువులను అణగదొక్కే ప్రయత్నాల్లో దిగిందని, పరిస్థితి మారకుంటే ఆ ఎన్నికల్లో హిందువులు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. హిందూ క్షేత్రమైన తిరుప్పరంకుండ్రంను కాపాడుకోవలని పోరాటాలకు దిగిన హిందువులను అనగదొక్కేవిధంగా డీఎంకే ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఖండించదగ్గవన్నారు.

తిరుత్తణిలో రెవెన్యూ ఉద్యోగుల నిరసన



నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు

తిరుత్తణి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రెవెన్యూ గ్రామ ఉద్యోగుల సంఘం ఛైర్మెన్ సురేష్ నేతృత్వంలో రెండో విడత గ్రామసహాయకుల జీవనోపాధి డిమాండ్లను నెరవేర్చాలంటూ తిరుత్తణి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేశారు. కార్యదర్శి వినాయగం, కోశాధికారి మదన్ కుమార్, జిల్లా కార్యదర్శి వెన్నెల, గ్రామ వ్యవహారాల అధికారుల సంఘం రఘువరన్, కమిటీ సభ్యుడు యువరాజ్, జిల్లా ప్రతినిధి కోటీశ్వరి, ఎన్నికల విభాగం డిప్యూటీ కార్యదర్శి మణికందన్ సహా 50మందికి పైగా నిరసనలో పాల్గొన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కేంద్రం ప్రోత్సాహం

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు పోత్సాహించేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుందని ఐపీఎమ్ఏ అధ్యక్షుడు కేవీ కార్తీక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని కొన్ని అంశాలను ఆయన బుధవారం ప్రస్తావించారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేలా పంపుసెట్ల ఉత్పత్తికి మరింత ప్రోత్సాహాన్ని కేంద్రం అందజేసిందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు ప్రయోజనాలను కల్పించడం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు తోర్పాటు అందించినట్లన్నారు. జల్ జీవన్ మిషన్ 2028 ద్వారా నీటి ఆవశ్యకత అంశాల్లో దేశపారిశ్రామిక రంగాన్ని మరింత వృద్ధి చేయడానికి కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నట్లు కార్తీక్ తెలిపారు.

సహకార బ్యాంకుల్లో 75 శాతం మేర నగల రుణాలు

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకులు నగల రుణాల విభాగం బంగారం విలువలో 75 శాతం రుణం ఇవ్వాలని నిర్ణయించారు. సహకార శాఖ పరిధిలో పనిచేస్తున్న సహకార బ్యాంకులు పలు రకాల రుణాలు అందిస్తున్నాయి. వడ్డీ తక్కువగా ఉండడంతో ప్రజలు సహకార బ్యాంకులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో, బంగారు విలువలో 75 శాతం వరకు రుణాలు అందించేందుకు రిజర్వ్ బ్యాంక్ అనుమతులిచ్చింది. మరోవైపు ప్రైవేటు బ్యాంక్‌లు, ఫైనాన్స్ సంస్థలు బంగారం విలువపై అధికంగా రుణాలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, సహకార బ్యాంకులు కూడా బంగారం విలువపై 75 శాతం మేర రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు సహకార శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.



అందుకే మళ్లీ విజయ్‌తో నటిస్తున్నా

● పూజా హెగ్డే

హీరో విజయ్‌తో కలిసి తాను నటించిన 'బీస్ట్' చిత్రాన్ని ప్రేక్షకులు అమితంగా ఆదరించారని, వారి ప్రేమాభిమానాలు పొందడం కోసమే మరోమారు విజయ్ సరసన నటిస్తున్నట్టు హీరోయిన్ పూజా హెగ్డే స్పష్టం చేశారు. విజయ్ - పూజా హెగ్డే కాంబినేషన్‌లో వచ్చిన 'బీస్ట్' మూవీ మిశ్రమ టాక్ సొంతం చేసుకుంది. కానీ, కలెక్షన్లపరంగా అదరగొట్టింది. ఈ నేపథ్యంలో విజయ్ నటించే 'జన నాయగన్'లో హీరోయిన్‌గా పూజా హెగ్డేను ఎంపిక చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ, 'నేను, విజయ్ కలిసి నటించిన 'బీస్ట్' చిత్రానికి ప్రేక్షకులు ఆదరించారు. ఆ తర్వాత విజయ్‌తో కలిసి మళ్ళీ ఎపుడు నటిస్తారంటే అనేక ఇంటర్వ్యూల్లో ప్రశ్నించారు. ప్రేక్షకుల ప్రేమాభిమానాలను మళ్ళీ పొందడం కోసం విజయ్ చిత్రంలో నటిస్తున్నాను. పైగా ఈ అవకాశాన్ని కోల్పోతే మళ్ళీ నటించే ఛాన్స్ వస్తుందో రాదో తెలియదు. ఎందుకంటే 'జన నాయగన్' విజయ్ నటించే చివరి చిత్రమంటూ ప్రచారం సాగుతుంది. విజయ్ నటిస్తూనే ఉండాలి. ఇది నా కోరిక మాత్రమే కాకుండా కోట్లాది మంది విజయ్ అభిమానుల ఆశ కూడా అని పేర్కొన్నారు.

డేనియల్ బాలాజీ చివరి చిత్రం

విడుదలకు సిద్ధం



డేనియల్ బాలాజీ (ఫైల్‌ఫొటో)

దివంగత నటుడు డేనియల్ బాలాజీ నటించిన ఆఖరి చిత్రం 'ఆర్ పీఎం'. ప్రసాద్ ప్రభాకర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో కోవై సరళ, వైజీ మహేంద్రన్, ఇళవరసు, దేవదర్శిణి, సునీల్ సుగ్గా తదితరులు నటించారు. గోల్డెన్ రీల్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్ పతాకంపై కల్పనా రాఘవేంద్ర నిర్మించారు. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'డేనియల్ బాలాజీ నటించిన చివరి చిత్రం ఇది. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో ఇది రూపొందింది. ప్రేక్షకులకు ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తుందన్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటుంది. త్వరలోనే టీజర్, ట్రైలర్ రిలీజ్ చేయనున్నారు.

కోలీవుడ్‌కు మరో కొత్త దర్శకుడు



జాఫర్

ఇటీవలికాలంలో అనేక మంది ప్రతిభావంతులైన యువ కళాకారులు, టెక్నీషియన్లు చిత్రపరిశ్రమకు పరిచయమవుతున్నారు. తాజాగా జాఫర్ అనే యువకుడిని అఫ్రింజ్ ప్రొడక్షన్ దర్శకుడిగా పరిచయం చేస్తోంది. ఈయన గతంలో సినీ జర్నలిస్టుగా కూడా పనిచేశారు. 'విడాముయర్చి' ఫేం గణేష్ శరవణన్ హీరోగా జాఫర్ తన తొలి చిత్రాన్ని రూపొందించనున్నారు. గణేష్ శరవణన్ గతంలో 'రావణకోట్టం'లో ఓ పాత్ర పోషించి అందరి ప్రశంసలు అందుకున్నారు. హీరోయిన్‌గా అయిషా, విజయ్ టీవీ ఫేం పుగళ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. చెన్నై, దానిపరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరుపుకోనుంది.

తమిళ చిత్రజ్యోతి



'విడాముయర్చి' స్పెషల్ షో'లకు అనుమతి

అగ్రహీరో అజిత్ కుమార్ నటించిన తాజా చిత్రం 'విడాముయర్చి'. గురువారం విడుదలకానున్న నేపథ్యంలో ప్రత్యేక ఆట (స్పెషల్ షో)కు ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో తొలి ఆటను గురువారం ఉదయం 9 గంటల నుంచి ప్రదర్శించనున్నారు. లైకా ప్రొడక్షన్ పతాకంపై మగిళ్ తిరుమేని దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 6వ తేదీ మాత్రం 5 ఆటలు ప్రదర్శించుకునేందుకు అనుమతిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, ఈ మూవీలో అజిత్, అర్జున్, త్రిష, రెజీనా, ఆరవ్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించగా అనిరుధ్ రవిచందర్ సంగీతం. హాలీవుడ్ మూవీ 'బ్రేక్‌డౌన్'కు రీమేక్‌గా తెరకెక్కించారు.



ఇష్టదేవేరులు వళ్ళి, దైవానై సమేతంగా కొలువుదీరిన పళని ఆండవర్

పళనిలో తైపూసం ఉత్సవాలకు ధ్వజారోహణం

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి ఆలయంలో తైపూసం ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పళని కొండ శిఖరంపై కొలువైన పెరియ నాయగి అమ్మవారి ఆలయంలో ఈ నెల 10వ తేదీ వరకు తైపూం ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన అంశమైన వెండి రథోత్సవం ఈ నెల 11వ తేదీ, తిరుకల్యాణం 15వ తేదీ నిర్వహించనున్నారు. తైపూసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి కావళ్లతో పళనికి పాదయాత్రగా వచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు హిందూ దేవాదాయ శాఖ వసతులు సమకూర్చింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొండ ఆలయంలో ఈ నెల 10, 11, 15 తేదీల్లో ప్రత్యేక దర్శనానికి టిక్కెట్ రద్దు చేశారు. తిరువళ్లూరు జిల్లాలో ప్రసిద్ధిచెందిన తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో లాగే పళనిలో నిర్వహించనున్న రథోత్సవం రోజున పరిసర ప్రాంతాల భక్తుల సౌకర్యార్థం బస్సులు నడుపనున్నట్లు హిందూ దేవాదాయ శాఖా మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. బుధవారం తైపూసం ధ్వజారోహణం పూజల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులతో పళని క్షేత్రం కిటకిటలాడింది. రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు.

పానగల్ పార్క్-కోడంబాక్కం మెట్రో సొరంగం

● జూలైలో పూర్తిచేయనున్న 'ఫెలికాన్', 'పీకాక్' యంత్రాలు

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్టులో, లైట్ హౌస్ నుంచి పూందమల్లి వరకు ఏర్పాటుకానున్న 4 రైలు మార్గంలో భాగంగా టీనగర్ పనగల్ పార్క్-కోడంబాక్కం మధ్య సొరంగ మార్గం పనులు జూన్ నాటికి పూర్తికానున్నాయి. మొదటి సొరంగం తవ్వుతున్న 'ఫెలికాన్' యంత్రం జూన్ నెలలో కోడంబాక్కం మీనాక్షి కళాశాల సమీపంలో పనులు పూర్తిచేస్తుందని అధికారులు తెలిపారు. నగరంలో రెండో విడత మెట్రో ప్రాజెక్ట్ 116.1 కి.మీ మేర మూడు మార్గాల్లో ఏర్పాటుకానుంది. ఈ మార్గాల్లో లైట్ హౌస్-పూందమల్లి వరకు 26.1 కి.మీ రైలు మార్గం ఏర్పాటుకానుంది. ఈ మార్గంలో లైట్ హౌస్ నుంచి కోడంబాక్కం ఫ్లై ఓవర్ వరకు సొరంగమార్గం, పవర్ హౌస్ నుంచి పూందమల్లి వరకు స్తంభాలపై రైలు మార్గం పనులు వివిధ దశల్లో ఉండగా, ఈ మార్గంలో 9 అండర్ మెట్రో రైల్వేస్టేషన్లు, 18 ఫ్లై ఓవర్ మెట్రో రైల్వేస్టేషన్లున్నాయి. ఈ మార్గంలో భాగంగా త్యాగరాయ నగర్ పనగల్ పార్క్ నుంచి కోడంబాక్కం వరకు 2.063 కి.మీ సొరంగ మార్గం నిర్మిస్తున్నారు.



పనగల్ పార్క్ వద్ద జరుగుతున్న మెట్రో పనులు

అందుకు 'ఫెలికాన్' అనే యంత్రాన్ని వినియోగిస్తున్నారు. భూమి నుంచి 18 మీటర్ల లోతున సొరంగం తవ్వే పనులు గత ఏడాది జనవరి 31వ తేది ప్రారంభమయ్యాయి. పనగల్ పార్క్ నుంచి కోడంబాక్కం మీనాక్షి కళాశాల వరకు 2.063 కి.మీ కాగా, పనగల్ పార్క్ నుంచి బయల్దేరిన యంత్రం ఏడాది అనంతరం కోడంబాక్కం రైల్వేస్టేషన్‌కు చేరింది. ఈ యంత్రం వెనుకగా వస్తున్న 'పీకాక్' యంత్రం 105 మీటర్ల దూరంలో ఉంది. ఫెలికాన్ యంత్రం సొరంగం తవ్వకాలు పూర్తిచేసి జూన్‌లో మీనాక్షి కళాశాల వద్దకు చేరుకుంటుందని, రెండో యంత్రం 'పీకాక్' జూలైలో వచ్చి చేరుతుందని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

26న మహాశివరాత్రి సందర్భంగా కుంభమేళా, గంగా హారతి



మహాశివరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులతో భోగనాథ శివకుమార్


ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ బుధవారం సాయంత్రం 3.30గంటల నుంచి తెల్లవారుజాము వరకు షావుకారుపేట వరదాముత్తి అప్పన్ వీధిలో ఉన్న నారాయణ గురవయ్య శెట్టి మండపంలో విశేషపూజలు నిర్వహించనున్నారు. వాసవీ యాత్ర టూర్ చెన్నై, వైశ్యగురు సేవా సమితి, తమిళనాడు విభాగం వాసవీ క్లబ్ షావుకారుపేట చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో హళ్ధీపూర్ వామనాశ్రమ స్వామి ఆశీస్సులతో 'కుంభమేళా, గంగా హారతి' రుద్రాభిషేకం పూజలు నిర్వహించనున్నారు. మహాశివరాత్రి ఉత్సవ కమిటీ చైర్మెన్ భోగనాథ శివకుమార్ బుధవారం నగరంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉత్సవ కమిటీతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాగ్‌రాజ్‌లో జరిగే కుంభమేళాలో పాల్గొనలేని భక్తులకు ఆ వైభవంలో పాల్గొన్నంత అనుభూతి కలిగించేలా తాము కుంభమేళా, గంగా హారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. శివయ్యకు మహారుద్రాభిషేకం, కుంభమేళా పవిత్రతీర్థంతో స్నానం, గంగా హారతి, తిరువార్చన తదితర పూజలను లోక కల్యాణార్థం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పూజల వివరాల కోసం 9791040786 అనే నెంబరును సంప్రదించవచ్చు.

మరుదమలై శివక్షేత్రంలో తైపూసం ఉత్సవాలు ప్రారంభం

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కోవై సమీపంలోని మరుదమలైలో ప్రసిద్ధిచెందిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో తైపూస ఉత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విశేష అలంకారంలో వళ్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్పవృక్ష వాహనంలో విహరించారు. మరుదమలై శివక్షేత్రంలో ప్రతిఏటా నిర్వహించే తైపూస ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు. ఈ ఏడాది ఉత్సవాల సందర్భంగా బుధవారం తెల్లవారుజామున గోపూజ, గణపతి పూజ, స్వామివారికి విశేష అలంకారం శివాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 6.30గంటలకు స్వామివారి ముత్తంగి ప్రత్యేక అలంకార, దీపారాధన చేశారు. అనంతరం ఆలయ ప్రధాన మండపంలో ఉన్న ధ్వజస్తంభంపై తైపూస ఉత్సవాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ధ్వజ పతతాకాన్ని పూజారులు ఆవిష్కరించారు. అదే విధంగా తైపూసం సందర్భంగా నిర్వహించనున్న రథోత్సవ ముహూర్తం సమయాన్ని కూడా నిర్ణయించారు. ధ్వజారోహణం సందర్భంగా వినాయకుడు మూషికవాహనంపై, వళ్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్పవృక్ష వాహనంలో పురవీధుల్లో విహరించారు. మధ్యాహ్నం 12గంటలకు ఉచ్చికాల అభిషేకం అనంతరం హంసవాహనంలో స్వామివారు విహరించారు. సాయంత్రం 4గంటలకు శైవ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన సుబ్రమణ్యస్వామివారికి తిరుకల్యాణోత్సవం జరగనుంది. అదేరోజు సాయంత్రం 6గంటలకు బంగారు నెమలి వాహనంలో స్వామివారి ఊరేగింపు, 11వతేదీ తైపూసం రథోత్సవం, తెల్లవారుజామున 1గంట నుండి పాదయాత్రగా వెళ్లే భక్తులను ఉదయం వరకు దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

● మంత్రి చక్రపాణి



పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు 10 లక్షల టన్నులు దాటాయని ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... రైతుల సౌకర్యార్థం ముఖ్యమంత్రి చొరవతో సెప్టెంబరు 1వ తేది నుంచే కొనుగోళ్లు ప్రారంభించామని తెలిపారు. రైతుల నుంచి డిమాండ్ లేకున్నా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని ముఖ్యమంత్రి పెంచడంతో 2024 సెప్టెంబరు 1వ తేది నుంచి తేలికపాటి వరి క్వింటాలుకు రూ.2,450, సాధారణ వరి క్వింటాలుకు రూ.2,405 చొప్పున కొనుగోలు చేస్తున్నామన్నారు. 2024 సెప్టెంబరు 1 నుంచి ఈ ఏడాది ఈ నెల (ఫిబ్రవరి) 4వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా 2,444 వరి కొనుగోలు కేంద్రాల ద్వారా, 1,44,248 మంది రైతుల నుంచి 10,41,583 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.2,247.52 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో 7,42,335 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసినట్లు, ఆ ప్రకారం, గత ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా 2,99,248 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

రోజాల ప్రదర్శనకు విస్తృత ఏర్పాట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలో మే నెలలో నిర్వహించనున్న రోజా ప్రదర్శనకు, 2.5 లక్షల మొక్కలను నాటుతున్నారు. ఈ పార్క్‌లో 4,201 రకాల రోజాలతో కలిపి 32వేల రోజా మొక్కలు పెంచుతున్నారు.



బ్రూమింగ్ పనుల్లో పార్క్ సిబ్బంది

గత ఏడాది కొత్తగా వంద రకాల రోజా పూలను పరిచయం చేశారు. ఈ ఏడాది ప్రదర్శన కోసం రోజా మొక్కల 'బ్రూమింగ్' ప్రారంభమైంది. ఈ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ లక్ష్మి భవ్య ప్రారంభించారు. ఈ విషయమై కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ఏడాది 20వ రోజా ప్రదర్శన మే నెలలో నిర్వహించనున్నామన్నారు. రోజా ప్రదర్శనకు 2.5 లక్షల మొక్కలు నాటి సంరక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.



చెన్నై, గిండి రహదారిలో బుధవారం ఉదయం మంచు కారణంగా నత్తనడక నడుస్తున్న వాహనాలు

పుదుచ్చేరిలో రూ.29.55కోట్లతో కొత్త బస్టాండ్

ప్యారీస్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో రూ.29.55 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మించిన బస్టాండ్ ప్రారంభోత్సవం త్వరతో జరుగుతుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. పుదుచ్చేరి నగరా భివృద్ధిలో భాగంగా 1980లో మరమలై అడిగలార్ రోడ్డులో రాజీవ్ గాంధీ బస్టాండు నిర్మించారు. పుదుచ్చేరి రాష్ట్ర జనాభాకు దీటుగా వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో ఈ బస్టాండ్‌కు స్థలం కొరత కూడా ఏర్పడింది. అందువల్ల సుమారు 40ఏళ్ల నాటి రాజీవ్ గాంధీ బస్టాండ్‌ను కూల్చివేయాలని పుదుచ్చేరి ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రప్రభుత్వం ప్రకటించిన 'స్మార్ట్ సిటీ' పథకం కింద హైటెక్ వసతులతో కూడిన బస్ టెర్మినల్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధవచేసింది. 2023 జూన్‌లో బస్ టెర్మినల్ నిర్మాణ పనులను ఆ రాష్ట్రముఖ్యమంత్రి రంగస్వామి ప్రారంభించారు. ప్రభుత్వం కేటాయించిన రూ..29.55కోట్లతో సుమారు 4.5 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బస్టాండ్ ప్రాంగణంలో 31 దుకాణాలు, రెండు హోటళ్లు, ప్రయాణికుల విశ్రాంతి గదులు, ప్రభుత్వ రవాణా శాఖ కార్యాలయాలు, టికెట్ రిజర్వేషన్ కౌంటర్, ఆమ్నీ బస్సుల కార్యాలయాలు, విచారణ కేంద్రం, ఫస్ట్ ఎయిడ్ కేంద్రం, కంట్రోల్ రూమ్, నిర్వాహక కార్యాలయం, రెండు డార్మిటరీలు ఉన్నాయి.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బస్టాండ్

సిమ్స్‌లో సౌదీ ఇంజనీర్‌కు అరుదైన శస్త్రచికిత్స

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని సిమ్స్ ఆస్పత్రిలో ఐదేళ్లపాటు ఎడమకంటి నరం వ్యాధితో బాధపడిన సౌదీ అరేబియా రియాద్‌కు చెందిన సుజీత్ సుకుమారన్ (40) అనే సివిల్ ఇంజనీరింగ్‌కు అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించినట్లు ఆస్పత్రి న్యూరో సర్జెన్ డాక్టర్ విశ్వరాజ్ రథ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుజీత్ 2020 నుండి హెమీఫేషియల్ స్పాస్ అనే (నిర్విరామంగా కన్ను గీటే వ్యాధి) వ్యాధికి గురై బాధపడుతుండేవాడని, మెదడు నుంచి కంటికి వరకు ఉన్న రక్తనాళం, నరం పెనవేసుకోవడం లేదా రక్తనాళం రాపిడి అధికమైన నరం అచేతనం కావటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుందని ప్రతి పదివేల మందిలో ఒకరు ఈ వ్యాధికి గురవుతారని సకాలంలో వైద్యులను సంప్రదిస్తే నయమవుతుందని చెప్పారు. స్విమ్స్‌లో సుజీత్‌కు మైక్రోవాస్కులర్ డీకంప్రెషన్ (ఎంవీడీ) అనే శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. మెదడులో వినికిడికి తోడ్పడే నరానికి చేరువుగా ఉన్న నరానికి కృతిమ ఇన్సులేషన్ (కవచం) వేయడమే ఈ అరుదైన శస్త్రచికిత్సలో కీలకఘట్టమని వివరించారు. మీడియా సమావేశంలో వైద్య నిపుణులు డాక్టర్ విజయ్ శంకరన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ కేఆర్ సురేష్ బాపు, న్యూరోఫిజియాజిస్ట్ డాక్టర్ నిశాంత్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



శస్త్రచికిత్స చేసుకున్న సుజీత్‌తో సిమ్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజు శివసామి, న్యూరో సర్జెన్ డాక్టర్ విశ్వరాజ్ తదితరులు



జైరామ్ ఠాకూర్

తిరుమలలో క్రికెటర్ స్మృతి మంధాన

తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్, మహిళా క్రికెటర్ స్మృతి మంధాన దర్శించుకున్నారు. ఆలయం ముందు స్మృతి మంధానతో సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు.



కుటుంబ సభ్యులతో స్మృతి మంధాన

సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.21 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,599

తలనీలాలు సమర్పించినవారు: 16,069





వివిధ టోర్నీల్లో వచ్చిన పతకాలతో..

కష్టాలకు ఎదురొడ్డి నిలిచి యోగా రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించారు వెంకటగిరికి చెందిన వసంతలక్ష్మి. తిరుపతిలోనే ఇంటర్, డిగ్రీ చదివిన ఈమె లెక్కకు మించి యోగా వీడియోలతో యూట్యూబ్ వీక్షకుల్లో పేరు సంపాదించారు. ఇటీవల నిర్వహించిన యోగా ప్రక్రియ గిన్నిస్ రికార్డులో నమోదు కావడంతో సీఎం చంద్రబాబు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేశ్‌శర్మ,శాప్‌చైర్మన్ రవినాయుడు ప్రత్యేకంగా ఈమెను అభినందించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి ఆంధ్రజ్యోతితో తన అనుభవాలను పంచుకున్నారిలా..

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

వసంత 'యోగా'ం



● నిర్విరామంగా శిక్షణ తరగతులు ● గిన్నిస్ బుక్‌లో వెంకటగిరి మహిళ

ఇంటర్ చదువుతుండగానే నాకు పెళ్లయింది. మా ఆయన హేమాధర్ ఆర్టీసీ కండక్టర్. పెళ్లయినా తిరుపతిలో డిగ్రీ చదివాను. ఉద్యోగ జీవితంలో మాఆయనకు ఒడుదుడుకులు ఎదురయ్యాయి. ఆర్థికపరమైన సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో 2009లో హైదరాబాదుకు వలస వెళ్లాం. అక్కడే చిన్న చిన్న ఉద్యోగాలు చేశాను. పని ఒత్తిడిని భరించలేక 2011లో యోగా శిక్షణకు వెళ్లాను. ఇది నా జీవితగతిని మలుపుతిప్పింది. ఆరు నెలల్లోనే ఆసనాలన్నీ నేర్చుకున్నాను. నేనే ఎందుకు యోగా నేర్పకూడదనే తలంపు వచ్చింది.



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వసంతలక్ష్మి

వెనకడుగు వేయకుండా వెంటనే యోగా తరగతులు చెప్పడానికి శ్రీకారం చుట్టాను. యోగాలో మరిన్ని ఉన్నత కోర్సులు చేశాను. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి సర్టిఫికేషన్ తీసుకున్నాక మంచి అవకాశాలు వచ్చాయి. స్వదేశ, విదేశ యోగా టోర్నీలో పాల్గొన్న ప్రతిసారీ పతకాలొచ్చాయి. హైదరాబాదులో కేజీకే ఇన్‌స్టిట్యూట్ 'యోగావిశారద బిరుదు ప్రదానం చేయడంతో గుర్తింపు వచ్చింది. కరోనా సమయంలో అపోలో ఆస్పత్రి చైర్మన్ ప్రతాప్ సిరెడ్డి సూచనతో చిత్తూరు జిల్లాలోని 252గ్రామాల్లో యోగా శిబిరాలను నిర్వహించాను. చాలామంది కరోనా నుంచి బయటపడటంతో ప్రతాప్ సిరెడ్డితో పాటు ప్రజలు విశేషంగా ఆదరించారు. వివిధ ఛానల్స్ నుంచి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కెరీర్‌కు గట్టి పునాది వేసుకోగలిగాను. ఇప్పుడు అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, నైరోబీ, మరికొన్ని దేశాల వారికి ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహిస్తున్నాను. మన దేశానికి చెందిన వివిధ వృత్తి నిపుణులు ఇందులో పాల్గొంటున్నారు. అధికబరువు, థైరాయిండ్, మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగాసనాలు చక్కటి పరిష్కారమని నిరూపించడంలో సఫలీకృతమయ్యాను. 2020లో చొరవ తీసుకుని వసంతయోగా అకాడమీ పెట్టాను. 2023 నవంబరులో సంస్థ సారథ్యంలో 45మందితో 28నిమిషాల్లో చేసిన 108 సూర్యనమస్కారాల కార్యక్రమం రికార్డు నెలకొల్పింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డు, ఆన్‌లైన్ క్లాసుల ద్వారా నోబుల్ బుక్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులు వరించాయి. 2023 డిసెంబరులో 3.42గంటలపాటు చేసిన 'సమకోణాసనం' గతేడాది డిసెంబరులో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డు దక్కించుకుంది. ఏదశలోనూ నిరాశను దరిచేయకుండా పట్టుదలతో పనిచేయడాన్ని అలవర్చుకోవడం వల్లే యోగా వసంతలక్ష్మిగా గుర్తింపు పొందగలిగానని వసంతలక్ష్మి వివరించారు.



కుమారుడు, భర్తతో వసంతలక్ష్మి

'విశ్వంభర' బ్లాక్‌బస్టర్ అవుతుంది

తిరుమల, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందని ఆ చిత్ర దర్శకుడు వశిష్ట ధీమా వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం'విశ్వంభర' చిత్రం షూటింగ్ జరుగుతోందని, మధ్యలో శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానని తెలిపారు. విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఓప్రశ్నకు బదులిచ్చారు.



దర్శకుడు వశిష్ట





అలిపిరి తీరు మారదా?

అన్యమత స్టిక్కర్‌తో తిరుమలకు కారు

తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు ముఖద్వారమైన అలిపిరిలో మరోసారి భద్రతావైఫల్యం బయటపడింది. అన్యమత వ్యాఖ్యలతో కూడిన స్టిక్కర్‌తో ఓ కారు నేరుగా తిరుమలకు చేరుకుంది. సాధారణంగా రాజకీయ, ఇతర మత గుర్తులు, జెండాలతో తిరుమలకు రావడం నిషేధం. బుధవారం ఓ కారు అన్యమతానికి చెందిన వ్యాఖ్యతో ఉన్న స్టిక్కర్‌తో తిరుమలకు చేరుకుంది. దీనిని చూసిన పలువురు మీడియాకు సమాచారం ఇచ్చారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై ఆ కారును వెనక్కి పంపేశారు.

మరి దీన్నేమంటారు..?

● డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారని కక్షకట్టిన వైసీపీ

● టౌన్ బ్యాంకు అధికారులతో బెదిరింపులు ● లోను కట్టకపోతే దండోరా వేస్తామంటూ హెచ్చరిక

తిరుపతి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారన్న కారణంగా తమ అధికారంలో ఉన్న టౌన్ బ్యాంకును అడ్డుపెట్టుకుని వైసీపీ కక్షపూరిత చర్యలకు పూనుకుంది. తిరుపతి టౌన్‌బ్యాంకులో తీసుకున్న లోను బకాయి ఇప్పటికిప్పుడు చెల్లించాలంటూ బుధవారం ఉదయం 17వ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి ఇంటికి అధికారులు వెళ్లారు. ఉన్నపళంగా చెల్లించకపోతే వీధిలో దండోరా వేస్తామని హెచ్చరించారు. బంధువులందరికీ ఫోన్లు చేసి బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించలేదంటూ బదనాం చేస్తామని బెదిరింపులకు పూనుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హఠాత్తుగా లోను కట్టాలని రావడం ఏమిటని, గడువు ఇస్తే చెల్లిస్తామని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకుని టౌన్ బ్యాంకు సిబ్బందితో మాట్లాడి పంపించేశారు. పైస్థాయిలో ఒత్తిడి కారణంగా తాము రావాల్సివచ్చిందని వారు చెప్పినట్టు తెలిసింది. టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తాళ్లూరు ప్రసాద్ వైసీపీ నాయకుడు. ఆయన భార్య రత్నకుమారి 17వ డివిజన్ కార్పొరేటర్. టౌన్ బ్యాంకు నుంచి ఇరువురు కలసి సుమారు రూ.15లక్షల రుణం తీసుకున్నారు. తాజాగా జరిగిన కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో వైసీపీ శిబిరంలోనే ఆమె ఉంటూ వచ్చారు. ఎన్నిక రోజు కూడా వారి బస్సులోనే సెనేట్ హాలుకు చేరుకున్నారు. ఓటు మాత్రం కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణకు వేశారు. దీంతో కౌన్సిల్ హాలులోనే కొందరు వైసీపీ మహిళా కార్పొరేటర్లు ఆమెను తూలనాడారు. సమావేశం అనంతరం ఆమె విలపిస్తూ సొమ్మసిల్లి బయట సోఫాలో వాలిపోయారు. 24 గంటలు గడవకముందే వైసీపీ తన పాత వైఖరినే ప్రదర్శించింది. వైసీపీ నేతృత్వంలోని టౌన్ బ్యాంకు పాలకమండలిని అడ్డుపెట్టుకుని కక్షకు తెరలేపింది. నిన్నటివరకు తమ కార్పొరేటర్ల ఆస్తులను కూల్చేస్తామని కూటమి నేతలు బెదిరిస్తున్నారంటూ వైసీపీ నేతలు గగ్గోలు పెట్టారు. మరి వారికి అనుకూలంగా ఓటు వేయలేదని, టౌన్‌బ్యాంకులో ఉన్న అధికారంతో తన పార్టీ కార్పొరేటర్ మీదే పగతీర్చుకోవడాన్ని ఏమంటారో సమాధానం చెప్పాల్సి వుంది.



రత్నకుమారి ఇంటి వద్ద టౌన్‌బ్యాంకు సిబ్బంది

జిల్లాకు 56 కొత్త బస్సులు

కోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాకు ఈ ఏడాది 56 కొత్త బస్సు సర్వీసులు రానున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ నరసింహులు తెలిపారు. బుధవారం కోట బస్టాండ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 846 బస్సులు కండిషన్‌లో ఉంటూ వివిధ ప్రాంతాలకు తిరుగుతున్నాయన్నారు. తిరుపతి నగరంలో నాలుగు డిపోల నుంచి 400 బస్సులు తిరుమలకు రాకపోకలు సాగిస్తున్నాయని, ఇందులో 100 ఎలక్ట్రికల్ బస్సులు కూడా నడుపుతున్నామన్నారు. కోట నుంచి తిరుమల, చిట్టమూరు నుంచి చెన్నైకు బస్సు సర్వీసులను నడపాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని, ఆయా సర్వీసుల ఏర్పాట్లపై దృష్టి పెడుతామన్నారు. జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్ల కొరత ఉన్నందున డ్రైవింగ్‌లో అనుభవం కలిగిన యువతకు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాలు చేపడుతామన్నారు. ఆయన వెంట వాకాడు డీఎం చినపెంచలయ్య, జూనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, గ్యారేజ్ ఇన్‌చార్జి నారాయణ, కంట్రోలర్ జార్జ్ ఉన్నారు.



మీడియాతో ఆర్ఎం నరసింహులు

గ్రావెల్ తవ్వకాలపై ఆర్డీవో చర్యలు

రెండు హిటాచీల సీజ్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పూలతోటమిట్ట నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా రవాణ చేసే గ్రావెల్ మట్టి మాఫియాపై సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి బుధవారం దాడులు జరిపింది. రెండు రోజులుగా పూలతోటమిట్ట గ్రామంలోని అసైన్‌మెంట్ భూముల నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి సూళ్లూరుపేట ప్రాంతంలోని ఓ పరిశ్రమకు తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో బుధవారం ఆర్డీవో గ్రావెల్ తవ్వుతున్న భూములను పరిశీలించారు. అక్కడున్న రెండు హిటాచీలను సీజ్ చేసి ఎస్ఐ అజయ్‌కుమార్‌కు అప్పగించారు. అనుమతి లేకుండా గ్రావెల్‌ను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు.



ఎస్ఐకు సూచనలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

చైర్మన్‌గా ఉన్నా సేవకుడినే..

● భావోద్వేగానికి గురైన బీఆర్ నాయుడు



తిరుమల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చైర్మన్ పదవి వచ్చినా తానూ సేవకుడినేనని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తిరుమలలోని శ్రీవారిసేవాసదన్-2లో బుధవారం ఆయన శ్రీవారిసేవకులను ఉద్దేశించి మాట్లాడుతూ..తాను కొన్నేళ్లుగా శ్రీవారికి సేవ చేయాలని చాలా ప్రయత్నించానన్నారు. మూడు నెలల క్రితం సీఎం చంద్రబాబు తనకు చైర్మన్‌గా సేవ చేసే అవకాశమిచ్చారంటూ కంటనీరు పెట్టుకున్నారు. వెంటనే భావోద్వేగాన్ని అదుపు చేసుకున్నారు. ఎన్నోసార్లు స్వామి దర్శనం లభించకగా తిరిగి వెళ్లిపోయిన సందర్భాలున్నాయని గుర్తు చేసుకున్నారు. రథసప్తమి సందర్భంగా భక్తులకు సేవలందించిన శ్రీవారి సేవకులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఎప్పుడైనా నేరుగా వచ్చి తనను కలవచ్చునన్నారు. అనంతరం ఆలయంలో పనిచేసేందుకు డిప్ సిస్టమ్ బటన్ నొక్కి, ఆన్‌లైన్‌లో 520 మందికి సేవ చేసేలా ఆటోమెటిక్ కేటాయింపు చేశారు. అనంతరం చైర్మన్‌ను సీపీఆర్వో రవి శాలువాతో సత్కరించారు.

ఆగివున్న మినీ లారీని ఢీకొన్న కారు

మహిళ దుర్మరణం, మరో నలుగురికి తీవ్ర గాయాలు ● తిరుమల వెళ్లొస్తుండగా ప్రమాదం









మృతి చెందిన ప్రవీణ - వ్యాన్‌ను ఢీకొన్న కారు - గాయపడిన అనూష, లక్ష్మీనారాయణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలించే మినీలారీ టైరు పంచరై.. రోడుపైన ఆగింది. దీనిని కారు ఢీకొనడంతో ఓ మహిళ మృతిచెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేటకు చెందిన ప్రవీణ, ఆమె కుమార్తె అనూష, వారి సమీప బంధువులైన పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన విశ్వనాథముని లక్ష్మీనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు, కుమారుడు సుమంత్ కలిసి మంగళవారం కారులో తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం తిరిగి నాయుడుపేటకు వెళ్తుండగా బుధవారం తెల్లవారుజామున మల్లాం జంక్షన్ సమీపంలోని రింగ్‌రోడ్డు వద్ద ఆగివున్న మీని లారీని వీరి కారు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ(44) అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది, పోలీసులు క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి, ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సుమంత్, లక్ష్మీనారాయణ పరిస్థితి విషమంగా ఉండడంలో నెల్లూరుకు పంపించారు. ప్రవీణ మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. నాయుడుపేట పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మినీ లారీ టైరు పంక్చర్ అవడంతో రోడ్డుమీద ఆగిపోయిందని, డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. మినీలారీలో ఉన్న 3,300 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం ఏఎంసీ గోదాముకు తరలించారు.

మద్యం షాపులకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 5 ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మిక ఉపకులాల వారికి కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువును ఈనెల 8వ తేది వరకు పొడిగించినట్లు జిల్లా ఈఎస్ నాగ మల్లేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వీరికోసం జిల్లాలో 23 మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించినట్లు వివరించారు. ఈనెల 8వ తేది సాయత్రరం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సాధారణ లైసెన్సు ఫీజులో సగం ధరనే వీరికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలోని ఏ పట్టణం, నగరం, మండలంలోనైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఈ నెల 10న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన దుకాణాల ఎంపిక, కేటాయింపులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని గీత కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నాగమల్లేశ్వరరెడ్డి

కొందరు కార్పొరేటర్లపై వైసీపీ వేటు

● మరికొందరికి వెసులుబాటుపై పార్టీలో అంతర్గత చర్చ

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమికి మద్దతు పలికిన కార్పొరేటర్లలో కొందరిపై వైసీపీ బహిష్కరణ వేటు వేసింది. మరికొందరిని వదిలేయడం ఆ పార్టీలో అంతర్గత చర్చ మొదలైంది. 10వ డివిజన్ కార్పొరేటరు ప్రతాప్ ఎరెడ్డి, 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లిక, ఆమె భర్త దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, 32వ డివిజన్ కార్పొరేటర్ శైలజ, ఆమె భర్త వేణుగోపాల్, 33వ డివిజన్ కార్పొరేటర్ దూది కుమారి, ఆమె భర్త శివప్రసాద్, 43వ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రాధ, ఆమె భర్త మురళియాదవ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడి పేరుతో ప్రకటన విడుదల చేశారు. ఇక, కూటమి అభ్యర్థికి ఓటు వేసిన వైసీపీ కార్పొరేటర్లు అనీష్ రాయల్, బోకం అనిల్, మోహన్ కృష్ణయాదవ్, తటస్థంగా ఉన్న పల్లూరు అమరనాథరెడ్డిపై వేటు పడకపోవడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముందస్తు ప్రణాళికతోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారా అన్న చర్చ కూడా నడుస్తోంది. వైసీపీ వాళ్లతో పాటే సెనేట్ హాలులోకి వెళ్లి.. కూటమి అభ్యర్థికి మద్దతిచ్చిన తాళ్లూరి రత్నకుమారిపైనా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మళ్లీ రూ.వంద కోట్లు దాటింది

● 35 నెలలుగా.. ప్రతినెలా శ్రీవారి హుండీ ఆదాయం రూ.వంద కోట్లపైనే

తిరుమల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం మళ్లీ వంద కోట్లు దాటింది. జనవరిలో భక్తులు హుండీలో వేసిన కానుకల ద్వారా రూ.106.17 కోట్లు లభించాయి. కాగా, కొవిడ్ అనంతరం 2022 మార్చి నెల నుంచి ప్రతి నెలా రూ.వంద కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తున్న విషయం తెలిసిందే. 2022 మార్చి నుంచి డిసెంబరు నెల నాటికి రూ.1,291.69 కోట్లు, 2023లో రూ.1,403.47 కోట్లు, 2024లో 1,365 కోట్లు హుండీ ద్వారా లభించాయి. ఇక, 2025 జనవరి నెలలో రూ.106.17 కోట్లు లభించడం గమనార్హం. ఇలా 35 నెలలుగా.. ప్రతి నెలా రూ.వంద కోట్లకుపైగా శ్రీవారి హుండీ కానుకలు లభిస్తున్నాయి. టీటీడీ ప్రధాన ఆర్థిక వనరుగా స్వామి హుండీ మారుతోంది.

స్విమ్స్‌లో మృతదేహం కోసం ఆందోళన

మాకివ్వాలంటే మాకివ్వాలని రెండు వర్గాల పట్టు

సర్దిచెప్పి పంపిన పోలీసులు, స్విమ్స్ అధికారులు



స్విమ్స్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మృతదేహాన్ని తమకంటే తతమకు అప్పగించాలంటూ రెండు వర్గాల వారు స్విమ్స్‌లో ఆందోళనకు దిగారు. నారాయణవనం మండలం చిత్తూరుకండ్రిగకు చెందిన రిటైర్డ్ విద్యుత్తు ఉద్యోగి కేవీ.సుబ్రహ్మణ్యం(79) అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన రెండో భార్య ఝాన్సీ మంగళవారం రాత్రి స్విమ్స్‌కు తీసుకురాగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మొదటి భార్య పద్మావతి స్విమ్స్‌కు చేరుకుని మృతదేహాన్ని తమకు అప్పగించాలని కోరారు. స్విమ్స్ అధికారులు కూడా మృతదేహాన్ని ఆమెకు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. ఆయన 30 ఏళ్లుగా తమ వద్దే ఉన్నారని, చిత్తూరుకండ్రిగలోనే అంత్యక్రియలు నిర్వహించాలని ఆయన బతికున్నప్పుడే రాసుకున్నాడని రెండో భార్య ఝాన్సీ చెప్పారు. నిబంధనల మేరకు మృతదేహాన్ని మొదటి భార్యకే అప్పగిస్తామని స్విమ్స్ అధికారులు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మార్చురీ ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వెస్ట్ పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ససేమిరా అన్నారు. చాలాసేపు చర్చల తర్వాత అందరూ కలిసి మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

భూమన అభినయ్‌పై కేసు

తిరుపతి(నేర విభాగం), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత భూమన అభినయ్‌పై అలిపిరి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రాం కిషోర్ తెలిపిన ప్రకారం.. డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో కూటమి నాయకులను కార్పొరేటర్ స్రవంతి తమ్ముడు రాజేష్ బెదిరిస్తూన్నాడని కొందరు టీడీపీ నాయకులు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం రాజేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలిసిన అభినయ్ తన అనుచరులతో అలిపిరి పోలీసు స్టేషన్‌కు వెళ్లి రాజేష్‌ను విడిచి పెట్టాలని డిమాండు చేశారు. పోలీసు అధికారుల ఆదేశాలు ఉన్నాయని సిబ్బంది చెప్పినా అభినయ్ వాగ్వాదానికి దిగారు. దీనిపై పోలీసులు సుబ్రమణ్యం, చంద్ర, ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రేషన్ సరఫరాలో అవకతవకలా..

94905 51117కు ఫిర్యాదు చేయండి

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'రేషన్ సరఫరా.. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాల్లో ఏవైనా అవకతవకలు జరుగుతున్నాయా? అలాంటి వాటిని వీడియోల ద్వారా 94905 51117 నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు' అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. గూడూరులోని సీఎస్ఎం ఉన్నత పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించిన ఆయన ఆహార నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పేదలకు నాణ్యత కలిగిన రేషన్‌బియ్యం పంపిణీ చేసేలా ఫుడ్‌కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. కొన్ని పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా సరఫరా చేస్తున్న ఆహారం రుచిగా లేదని ఫిర్యాదులు అందాయన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సరిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు చంద్రశేఖర్, డిప్యూటీఈవో సనత్‌కుమార్, ఎంఈవో కాంచన, సీడీపీవో మెహబూబీ తదితరులు పాల్గొన్నారు.